ముంబైకి ఓడుపే..

కష్టపడి గెలిచిన లక్నో • రాణించిన సూపర్ జెయింట్స్ బౌలర్లు

లక్నో : ఐపీఎల్-17లో చెత్త ప్రదర్శనతో సత మతమవుతున్న ముంబై ఇండియన్స్‌కు మరో సారి భంగపాటు తప్పలేదు. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన 'లో స్కోరింగ్ థ్రిల్లర్'లో రాహుల్‌సేనదే పైచేయి అయింది. లక్నో బౌలర్లు సమిష్టిగా రాణించడంతో.. తొలుత ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 144 పరుగులకే పరిమితమైంది. వధేరా 46) ఆ జట్టును ఆదుకున్నాడు. అనంతరం ఛేదనలో లక్నో సైతం కష్టమ్మీదే గెలిచింది. 19.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' స్టోయినిస్ (62) లక్నో విజయంలో కీలకపాత్ర పోషించాడు. లీగ్‌లో పది మ్యాచ్‌లు ఆడిన ముంబై ఏడు ఓటములు, మూడు విజయాలతో 9వ స్థానంలో ఉంది.

ముంబై దారుణంగా..

57/4. పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న ముంబై పది ఓవర్లకు చేసిన స్కోరు అది. రోహిత్‌శర్మ (4), సూర్యకుమార్ (10), తిలక్ వర్మ (7), పాండ్యా(0) చేతులెత్తేయడంతో 5.2 ఓవర్లకే ముంబై 4 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. వధేరా ఆచితూచి ఆడి ఆ జట్టును ఆదుకోగా ఆఖర్లో డేవిడ్ (35 నాటౌట్) మెరుపులు మెరిపించకుంటే ముంబై పరిస్థితి మరింత ఘోరంగా ఉండేది.

లక్నో కష్టంగానే..

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో లక్నో కూడా కష్టంగానే గెలుపు దిశగా సాగింది. తొలి ఓవర్‌లోనే ఆ జట్టు ఓపెనర్ అర్షిన్ కులకర్ణి వికెట్ కోల్పోయింది. కెఎల్ రాహుల్ (28) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. దీపక్ హుడా (18) మళ్లీ విఫలమయ్యాడు. కానీ చెన్నైతో మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన స్టోయినిస్ లక్నోను మరోసారి ఆదుకున్నాడు. అయితే లక్నో విజయానికి 30 పరుగులు అవసరమనగా అతడు కూడా పెవిలియన్ చేరాడు. బదోని (6) సైతం రనౌట్ అయ్యాడు. కానీ పూరన్ (14 నాటౌట్), కృనాల్ (1 నాటౌట్) గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశారు.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	9	8	1	0.69	16
కోల్‌కతా	9	6	3	1.09	12
లక్నో	10	6	4	0.09	12
చెన్నై	9	5	4	0.81	10
హైదరాబాద్	9	5	4	0.07	10
ఢిల్లీ	11	5	6	-0.44	10
గుజరాత్	10	4	6	-1.11	8
పంజాబ్	9	3	6	-0.18	6
ముంబై	10	3	7	-0.27	6
బెంగళూరు	10	3	7	-0.41	6

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

సంక్షిప్త స్కోర్లు

ముంబై: 20 ఓవర్లలో 144/7 (నేహాల్ 46, డేవిడ్ 35నాటౌట్, మోహ్సిన్ 2/36, నవీనుల్ 1/15) **లక్నో:** 19.2 ఓవర్లలో 145/6 (స్టోయినిస్ 62, రాహుల్ 28, హార్దిక్ 2/26, నబీ 1/16)

నిత్య డబుల్ ధమాకా

• ఇండియన్ గ్రాండ్‌ప్రి అథ్లెటిక్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బెంగళూరులోని కంఠీరవ స్టేడియం వేదికగా జరిగిన ఇండియన్ గ్రాండ్‌ప్రి-1 టోర్నీలో తెలంగాణ యువ అథ్లెట్ నిత్య గాదె స్వర్ణం సహా కాంస్య పతకంతో మెరిసింది. మంగళవారం జరిగిన మహిళల 100మీటర్ల రేసును నిత్య 11.78 సెకన్ల టైమింగ్‌తో ముగించి పసిడి పతకం కైవసం చేసుకుంది. సర్బానీనంద(ఒడిశా), సుదీక్ష(కర్ణాటక) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. మహిళల 200మీ రేసులో నిత్య 24.01సె టైమింగ్‌తో కాంస్యం ఖాతాలో వేసుకుంది. ఇదే విభాగంలో విస్మయ(కేరళ), సర్బానీనంద(ఒడిశా) స్వర్ణ, రజత పతకాలు సొంతం చేసుకున్నారు.

రెండో టీ20 భారత్‌దే..

సిల్హెట్: బంగ్లాదేశ్ పర్యటనలో భారత మహిళల క్రికెట్ జట్టుకు రెండో విజయం. సిల్హెట్ వేదికగా మంగళవారం జరిగిన రెండో టీ20లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 19 పరుగుల (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 20 ఓవర్లకు 119 పరుగులకే ఆలౌట్ అయింది. ముర్షీదా ఖాన్ (46) టాప్ స్కోరర్ కాగా భారత స్పిన్నర్లు రాధా యాదవ్ (3/19), శ్రేయాంక (2/24) ప్రత్యర్థిని కట్టడిచేశారు. అనంతరం స్వల్ప ఛేదనలో భారత్.. వర్షం వల్ల మ్యాచ్ ఆగిపోయే సమయానికి 5.2 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 47 పరుగులు చేసింది.

రాణాపై ఒక మ్యాచ్ నిషేధం

• కేకేఆర్ బౌలర్‌కు షాక్

కోల్‌కతా: ఐపీఎల్-17లో కోల్‌కతా నైట్ రైడర్స్ పేసర్ హర్షిత్ రాణాకు ఐపీఎల్ పాలకమండలి షాకిచ్చింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో సోమవారం ముగిసిన మ్యాచ్‌లో అతడు ఐపీఎల్ నియమావళిలోని ఆర్టికల్ 2.5ను ఉల్లంఘించినందుకు గాను అతడి మ్యాచ్ ఫీజులో వంద శాతం కోతతో పాటు ఒక మ్యాచ్ నిషేధం కూడా విధించింది. ఢిల్లీతో మ్యాచ్‌లో అభిషేక్ పొరెల్‌ను ఔట్ చేశాక రాణా స్పందించిన తీరే ఇందుకు కారణం. అంతకుముందు రాణా.. హైదరాబాద్‌తో మ్యాచ్‌లో మయాంక్ అగర్వాల్‌ను ఔట్ చేశాక 'ఫ్లైయింగ్ కిస్' ఇస్తూ మ్యాచ్ ఫీజులో 60 శాతం కోల్పోయాడు.

భారత సైన్యమిదే

టీ20 ప్రపంచకప్ టోర్నీకి భారత జట్టు ఎంపిక • 14 నెలల తర్వాత రిషబ్ పంత్ పునరాగమనం

చాహల్, సంజూకు పిలుపు • రాహుల్, రింకూకు నిరాశ

న్యూఢిల్లీ: వెస్టిండీస్, అమెరికాలో వచ్చే నెల నుంచి జరుగనున్న టీ20 వరల్డ్‌కప్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) జట్టును ప్రకటించింది. పొట్టి ప్రపంచ కప్‌లో జట్ల ప్రకటనకు ఆఖరి తేదీ నేటి (మే 1)తో ముగియనుండగా అజిత్ అగార్కర్ నేతృత్వంలోని ఆలిండియా సెలక్షన్ కమిటీ మంగళవారం అహ్మదాబాద్‌లో సమావేశమై జట్టును ఎంపికచేసింది. రోహిత్‌శర్మ సారథ్యంలోని 15 మంది సభ్యులు గల టీమిండియాకు హార్దిక్ పాండ్యా వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. జట్టు ఎంపికలో భాగంగా వికెట్ కీపర్ రిషభ్ పంత్ 14 నెలల తర్వాత భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. 2023 ఆగస్టు తర్వాత లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ 'మెన్ ఇన్ బ్లూ'తో కలవనుండగా సంజూ శాంసన్ రెండో వికెట్ కీపర్‌గా ఎంపికయ్యాడు. ఫామ్‌లేమితో తంటాలు పడుతున్న హార్దిక్‌నూ, ఐపీఎల్ తాజా సీజన్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న యువ సంచలనం యశస్వీ జైస్వాల్ పైనా సెలక్టర్లు నమ్మకముంచారు. ఐపీఎల్‌లో సిక్సర్ల సునామీతో రెచ్చిపోతున్న శివమ్ దూబే కూడా జట్టులో స్థానం నిలుపుకున్నాడు. రోహిత్, కోహ్లీ, జైస్వాల్, సూర్యకుమార్ యాదవ్, పంత్, దూబే బ్యాటింగ్ భారాన్ని మోయనున్నారు. హార్దిక్, దూబే సీమ్ ఆల్‌రౌండర్లు కాగా జడేజా, అక్షర్ పటేల్ స్పిన్ ఆల్‌రౌండర్లుగా ఉన్నారు. చాహల్, కుల్దీప్ స్పిన్ బాధ్యతలు మోయనుండగా పేస్ విభాగానికి బుమ్రా నాయకత్వం వహించనున్నాడు. ఐపీఎల్‌లో దారుణంగా విఫలమవుతున్నా మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్ జట్టులో చోటు దక్కించుకున్నారు.

టీ20 ప్రపంచకప్ టోర్నీ కోసం ఎంపిక చేసిన భారత జట్టు సభ్యుల పేర్లు న్యూయార్క్‌లోని ప్రఖ్యాత అంపైర్‌స్టేట్ బిల్డింగ్‌పై మంగళవారం ప్రదర్శించిన దృశ్యమిది.

వీళ్లకు నిరాశ

రెండో వికెట్ కీపర్‌గా సంజూ శాంసన్ వైపు మొగ్గుచూపిన సెలక్టర్లు కెఎల్ రాహుల్‌ను పక్కనబెట్టారు. రాహుల్‌తో పాటు శుభ్‌మన్ గిల్, రింకూ సింగ్, ఐపీఎల్‌లో నిలకడగా ఆడుతున్న రుతురాజ్, మణికట్టు స్పిన్నర్ రవి బిష్ణోయ్‌కూ నిరాశ తప్పలేదు. అయితే ప్రధాన జట్టులో చోటు దక్కకపోయినా గిల్, రింకూ, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్ రిజర్వ్ బెంచ్‌లో ఉన్నారు.

భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), యశస్వీ జైస్వాల్, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్, సంజూ శాంసన్, శివమ్ దూబే, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

రిజర్వ్ : గిల్, రింకూ, ఖలీల్, అవేశ్

ఆ ప్రయాణం స్ఫూర్తిదాయకం!

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

ఒంటినిండా గాయాలు.. శరీరం నుంచి ఏక ధారలా కారుతున్న రక్తం.. డిసెంబర్ మాసంలో ఉత్తరాది మంచు కారణంగా ఉదయం ఐదు గంటలైనా జనం ఇంకా నిద్రలేవని సమయాన ఎక్కడున్నాడో, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నాడో తెలియని స్థితి. ఘోర రోడ్డు ప్రమాదం కారణంగా చావు అంచుల దాకా వెళ్లొచ్చి.. నాలుగు రోజులు గడిస్తే గానీ 'ప్రాణాలకు ప్రమాదమేమీ లేదుగానీ ఇప్పట్లో నడవలేడు' అన్న పిడుగులాంటి వార్త. మూడు నెలల పాటు బెడ్ దిగలేదు. అయినా ఆ యోధుడు పోరాటాన్ని వీడ లేదు. అప్పుడు అతడి పరిస్థితి చూసి 'ఇప్పట్లో భారత జట్టులోకి రావడం కష్టమే!' అని పెదవివిరిచినవాళ్లే ఎక్కువ. కానీ ఆ కుర్రాడు కెరటంలా దూసుకొచ్చాడు. అతడే రిషభ్ పంత్. చేతికర్ర సాయంతోనే బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో చేరి అక్కడ వైద్యులు, ఫిట్‌నెస్ గురువుల సమక్షంలో తనను తాను రాటు దేల్చుకున్నాడు. ఒక క్రమపద్ధతిలో మళ్లీ పూర్తి ఫిట్‌నెస్ సాధించి ఏడాది తర్వాత ఐపీఎల్-17లో రీఎంట్రీ ఇచ్చిన అతడు ఈ సీజన్‌లో తన పునరాగమనాన్ని ఘనంగా చాటుతున్నాడు. తనదైన ఒంటిచేతి సిక్సర్లు, వికెట్ల వెనుక విన్యాసాలు ఒక ఎత్తైతే వికెట్ల మధ్య పంత్ పరుగెత్తుతున్న తీరు చూసి అసలు రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లకూ గాయాలయ్యింది ఇతడికేనా..? అన్న అనుమానం రాక మానదు. తాజాగా 14 నెలల తర్వాత పంత్ మళ్లీ భారత జట్టులోకి వచ్చాడు. రోడ్డు ప్రమాదమైన 2022 డిసెంబర్ 30 నుంచి 14 నెలల తర్వాత భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చేదాకా అతడి ప్రయాణం స్ఫూర్తిదాయకం!

చైనా చేతిలో భారత్ చిత్తు

ఊబర్ కప్

చెంగ్డూ: ప్రతిష్టాత్మక ఊబర్ కప్ గ్రూప్ దశలో కెనడా, సింగపూర్‌ను మట్టికరిపించి క్వార్టర్స్ బెర్త్ ఖాయం చేసుకున్న భారత యువ షట్లర్లు పటిష్టమైన చైనాతో పోరులో మాత్రం చేతులెత్తేశారు. మంగళవారం జరిగిన ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో భారత్.. 0-5 తేడాతో చైనా చేతిలో అవమానకర ఓట మిని మూటగట్టుకుంది. ఇదివరకే క్వార్టర్స్ బెర్త్ ఖాయమైన ఈ టోర్నీలో భాగంగా చైనాతో పోరులో అష్మిత చాలిహా బరిలోకి దిగలేదు. సింగిల్స్‌లో ఇషాణి బరుహా 12-21, 10-21 తేడాతో ప్రపంచ రెండో ర్యాంకర్ చెన్ యు ఫీ చేతిలో చిత్తయ్యింది. అన్మోల్ 9-21 ఒక సెట్ ముగియగానే కాలి గాయంతో వెనుదిరిగింది. తన్వీ శర్మను 7-21, 16-21 తేడాతో వాంగ్ జి యి ఓడించింది. డబుల్స్‌లో ప్రియ-శృతి ద్వయాన్ని 13-21, 12-21 తేడాతో వరల్డ్ చాంపియన్స్ చెన్ కింగ్-జియా యి ఫాన్ జంట ఓడించింది.

ధరలు పెరిగినా.. తగ్గేదేలే

జనవరి-మార్చి డిమాండ్ 136.6 టన్నులుగా నమోదు

ప్రపంచ స్వర్ణ మండలి తాజా నివేదిక

దేశంలో బంగారానికి 8 శాతం ఎగిసిన ఆదరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: రికార్డు స్థాయిలో ధరలు పెరుగుతున్నా.. దేశంలో బంగారానికి ఆదరణ మాత్రం తగ్గడం లేదు. ఈ జనవరి-మార్చి త్రైమాసికం (క్యూ1)లో 136.6 టన్నులు (ఆభరణాలు, పెట్టుబడులు తదితరాలన్నీ కలిపి)గా నమోదైంది. గతంతో పోల్చితే 8 శాతం పెరగడం గమనార్హం. నిరుడు జనవరి-మార్చిలో 126.3 టన్నులే. ఇక మంగళవారం విడుదలైన ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) నివేదిక 'గోల్డ్ డిమాండ్ ట్రెండ్స్ క్యూ1 2024' ప్రకారం భారతీయ గోల్డ్ డిమాండ్ విలువ వార్షిక ప్రాతిపదికన 20 శాతం ఎగిసి రూ.75,470 కోట్లుగా నమోదైంది. నిరుడు రూ.63,090 కోట్లు. ఈ ఏడాది తొలి 3 నెలల్లో ధరల సగటు కూడా 11 శాతం ఎగబాకడం విశేషం. కాగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పెద్ద ఎత్తున చేస్తున్న పసిడి కొనుగోళ్లు కూడా డిమాండ్ పెరుగుదలకు కారణమవుతున్నదని డబ్ల్యూజీసీ ఈ సందర్భంగా అభిప్రాయపడింది.

పెట్టుబడులపై దృష్టి

ఆభరణాల రూపంలో భౌతిక బంగారాన్ని కొనేందుకు ఇష్టపడుతున్న భారతీయులు.. పెట్టుబడులపైనా అంతే ఆసక్తిని కనబరుస్తున్నారు. ఈ క్రమంలోనే కడ్డీలు, నాణేలు, ఈటీఎఫ్ వంటి ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్‌కు డిమాండ్ పెరిగినట్టు డబ్ల్యూజీసీ ఇండియా విభాగం ప్రాంతీయ సీఈవో సచిన్ జైన్ తెలిపారు. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి 2 టన్నులకుపైగా వచ్చాయన్నారు. ఆర్బీఐ కూడా బంగారం కొనుగోళ్లకు దిగుతుండటంతో సహజంగానే డిమాండ్ ఇంకా పెరుగుతోందని చెప్పారు. అయితే ప్రస్తుత ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో గోల్డ్ డిమాండ్ దేశంలో తగ్గవచ్చన్న సచిన్.. పెరుగుతున్న ధరలు, లోక్‌సభ ఎన్నికలే కారణమన్నారు.

అంతర్జాతీయంగా..

ఈ జనవరి-మార్చిలో అంతర్జాతీయంగా కూడా గోల్డ్ డిమాండ్ 3 శాతం పెరిగింది. 1,238 టన్నులకు చేరింది. 2016 తర్వాత ఓ త్రైమాసికంలో ఈ స్థాయిలో పుత్తడికి ఆదరణ కనిపించడం ఇదే తొలిసారి అని డబ్ల్యూజీసీ తెలిపింది. ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు, ఆసియా దేశాల కొనుగోలుదారుల నుంచి డిమాండ్‌తో ధరలు ఎక్కువగా ఉన్నా.. గిరాకీ తగ్గలేదన్నది. ఇక గ్లోబల్ మార్కెట్‌లో ఔన్సు గోల్డ్ రేటు సగటున 2,070 డాలర్లు పలికింది. నిరుడుతో పోల్చితే 10 శాతం, గత త్రైమాసికంతో చూస్తే 5 శాతం ఎక్కువ.

'బంగారంపట్ల భారతీయులకున్న ఇష్టానికి తాజా గణాంకాలు అద్దం పడుతున్నాయి. ఇక్కడి పండుగలు, వివాహాది శుభ కార్యాలతో పసిడికి విడదీయరాని బంధం ఉన్నది. ఈసారి వర్షాలు సమృద్ధిగా పడితే గోల్డ్ డిమాండ్ ఇంకా పెరుగుతుంది. నిజానికి ధరలు తగ్గితే భారత్, చైనాల్లో డిమాండ్ కనిపిస్తుంది. కానీ తొలిసారి రేట్లు పెరుగుతున్నా.. ఆదరణ మాత్రం కొనసాగుతూనే ఉన్నది'

-సచిన్ జైన్, డబ్ల్యూజీసీ ఇండియా ప్రాంతీయ సీఈవో

ఈ జనవరి-మార్చిలో..

- మొత్తం దేశీయ గోల్డ్ డిమాండ్‌లో నగల వాటా 95.5 టన్నులు (విలువ రూ.52,750 కోట్లు). గతంలో ఇది 91.9 టన్నులే (విలువ రూ.45,890 కోట్లు). డిమాండ్ 4 శాతం, విలువ 15 శాతం చొప్పున పెరిగాయి. డిమాండ్‌లో పెట్టుబడుల (నాణేలు, కడ్డీలు ఇతరత్రా) వాటా కూడా 34.4 టన్నుల (విలువ రూ.17,200 కోట్లు) నుంచి 41.1 టన్నుల (విలువ రూ.22,720 కోట్లు)కు ఎగిసింది. డిమాండ్ 19 శాతం, విలువ 32 శాతం వృద్ధి చెందింది.
- దేశంలో రీసైక్లింగ్ చేసిన గోల్డ్ 38.3 టన్నులుగా ఉన్నది. నిరుడు జరిగినది 34.8 టన్నులే. 10 శాతం పెరిగింది.
- దేశంలోకి దిగుమతైన బంగారం 179.4 టన్నులు. గత ఏడాదితో చూస్తే 25 శాతం పెరిగింది. నాడు 143.4 టన్నులే.
- దేశీయ మార్కెట్‌లో సగటు ధర (దిగుమతి సుంకం, జీఎస్టీ కాకుండా) తులం రూ.55,247.20గా నమోదు. నిరుడు రూ.49,943.80.
- ఈ ఏడాది 700-800 టన్నుల స్థాయికి దేశంలో బంగారం డిమాండ్ చేరుతుందని డబ్ల్యూజీసీ అంచనా. అయితే ధరలు పెరుగుతూపోతే తగ్గే వీలున్నది. గత ఏడాది 747.5 టన్నులుగా గోల్డ్ డిమాండ్ ఉన్నది.
- 2023 మొత్తంగా 16 టన్నుల బంగారాన్ని కొన్న ఆర్బీఐ. ఈ ఏడాది జనవరి-మార్చిలోనే ఏకంగా 19 టన్నుల కొనుగోలు. ఈ డిసెంబర్‌కల్లా మరింతగా పసిడి నిల్వల్ని పెంచుకోనున్న ఆర్బీఐ.

స్పాట్ మార్కెట్‌లో ఇదీ..

దేశీయ స్పాట్ మార్కెట్‌లో మంగళవారం బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ పసిడి విలువ రూ.150 దిగి రూ.72,600గా ఉన్నది. కిలో వెండి ధర కూడా రూ.750 క్షీణించి రూ.83,750గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు గోల్డ్ 13 డాలర్లు పతనమై 2,320 డాలర్లుగా ఉన్నది. వెండి 26.80 డాలర్లకు పరిమితమైంది. ఇక హైదరాబాద్ మార్కెట్‌లో బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి. 24 క్యారెట్ తులం రూ.72,600, 22 క్యారెట్ రూ.66,550గా ఉన్నాయి. కిలో వెండి రేటు మాత్రం సోమవారంతో పోల్చితే రూ.500 తగ్గి రూ.83,500గా ఉన్నది.

భారత్‌కు మస్క్ షాక్

- చైనాలో ఆకస్మిక పర్యటన
- ఇక్కడికి రానంటున్న టెస్లా అధినేత
- దేశంలో కంపెనీ పెట్టుబడులు పాశుల కేనా?
- మోదీ సర్కారుకు గట్టి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: భారత్‌కు ఎలాన్ మస్క్ షాకిచ్చారు. చైనాలో ఆకస్మికంగా పర్యటించి ఆ దేశ ప్రధాన మంత్రి లీ కియాంగ్‌తో సమావేశమై వ్యాపార, పారిశ్రామిక, పెట్టుబడి అంశాలపై చర్చించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారుతున్నది. ఇండియా టూర్‌ను రద్దు చేసుకున్న మస్క్.. హఠాత్తుగా చైనాలో తేలారు మరి. భారత్‌లో వారం, 10 రోజుల కిందటే మస్క్ పర్యటించాల్సి ఉందన్న విషయం తెలిసిందే. కానీ ఇక్కడికి రానన్న ఈ టెస్లా అధినేత.. ఆదివారం ఆగమేఘాల మీద పొరుగు దేశానికి వెళ్లారు. దీంతో దేశ, విదేశీ మీడియాల్లో 'హలో చైనా.. గుడ్‌బై ఇండియా' అన్న వార్తలు వస్తుండటం గమనార్హం.

విధానం మార్చుకున్నా..

భారత్‌లో టెస్లా పెట్టుబడుల కోసం.. మోదీ సర్కారు నిబంధనలు, విధానాల్ని మార్చి పన్ను రాయితీలు కల్పించినా ఆశించిన ఫలితం మాత్రం రావడం లేదు. నిజానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశమై, ఇక్కడ రూ.25,000 కోట్ల పెట్టుబడితో ఓ విద్యుత్తు ఆధారిత (ఈవీ) వాహనాల తయారీ ప్లాంట్‌ను మస్క్ ప్రకటించబోతున్నారన్నది వినిపించింది. కానీ అనూహ్యంగా మస్క్.. భారత్ పర్యటన రద్దైంది. మరోవైపు చైనాలో పర్యటించారు. దీంతో భారత్‌లో టెస్లా పెట్టుబడుల సంగతి ఇక అంతేనా?.. చైనాకు వెళ్లినట్టేనా?.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ నిర్ణయాలు నచ్చకే..

మస్క్ ఇచ్చిన ట్విస్ట్.. ఎన్నికల వేళ కేంద్రంలోని మోదీ సర్కారుకు మింగుడు పడకుండా ఉన్నదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి ప్పుడు. టెస్లా పెట్టుబడులను.. ఎన్నికల ప్రచారంలో మోదీ స్నేహశీల వ్యాపార విధానానికి నిదర్శనంగా బీజేపీ వర్గాలు వాడుకోవాలని మూశాయంటున్నారు. కానీ మస్క్ చైనా పర్యటనతో సీన్ రివర్సైంది. ప్రతిపక్షాలు సైతం మోదీ సర్కారు వైఫల్యం వల్లే ఇదంతా అని విమర్శిస్తున్నాయి. 'మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానాలపై విశ్వాసం లేకనే భారత్‌కు రావాల్సిన విదేశీ కంపెనీలు చైనాకు తరలిపోతున్నాయి. టెస్లా అంశమే ఇందుకు తాజా ఉదాహరణ' అని ఎక్స్‌లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షమా మహ్మద్ దుయ్యబట్టారు. యూట్యూబ్ చానళ్లలో కూడా 'భారత్‌కు రావడానికి సమయం లేని మస్క్.. చైనాకు వెళ్లారు ఎందుకో' అన్న రీతిలో కథనాలు మొదలయ్యాయి.

రాణించిన బీవోఎం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.1,218 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.840 కోట్లతో పోలిస్తే 45 శాతం వృద్ధిని కనబరిచింది. బ్యాంక్ ఆదాయం ఈసారి రూ.6,488 కోట్లకు ఎగబాకింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.88 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.20 శాతానికి తగ్గింది. మరోవైపు, రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.1.40 లేదా 14 శాతం డివిడెండ్‌ను బోర్డు ప్రతిపాదించింది.

హైదరాబాద్‌లో మోడిపై కార్యాలయం

హైదరాబాద్, ఏప్రిల్ 30: అంతర్జాతీయ ఫిన్‌టెక్ సేవల సంస్థ మోడిపై..దక్షిణ భారతంలో తన వ్యాపారాన్ని విస్తరించడానికి ప్రణాళికలు రచిస్తున్నది. ఇప్పటికే ముంబై, ఢిల్లీలో కార్యాలయాలు ఉండగా..దక్షిణాదిలో వ్యాపార విస్తరణకోసం హైదరాబాద్‌తోపాటు బెంగళూరులలో నూతన కార్యాలయాన్ని తెరువాలనుకుంటున్నట్లు మోడిపై ఇండియా కంట్రీ హెడ్ సచిన్ నిగం తెలిపారు. వచ్చే ఆరు నుంచి తొమ్మిది నెలల్లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన కార్యాలయం అందుబాటులోకి రానున్నట్లు, ఆ తర్వాత బెంగళూరులో ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం సంస్థలో 100కి పైగా ఉద్యోగాలు

ఉన్నారని, కొత్త ఆఫీస్‌లతో మరో 20 వరకు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఎగుమతిదారులకు ఆర్థిక సేవలు అందించే సంస్థకు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో కస్టమర్లు ఉన్నారని, దీంతో ఇక్కడ ఆఫీస్ తెరువాలని నిర్ణయించినట్లు చెప్పారు. అంతర్జాతీయంగా సంస్థ 2.5 బిలియన్ డాలర్ల మేర ఫైనాన్స్ చేసిందని, వీటిలో భారత్‌లోనే 1.5 బిలియన్ డాలర్లు ఇచ్చినట్లు చెప్పారు.

సింఫనీ లాభం 48 కోట్లు

హైదరాబాద్, ఏప్రిల్ 30: ఎయిర్ కూలర్ల సంస్థ సింఫనీ..అంచనాలకుమించి ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.48 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.16 కోట్ల లాభంతో పోలిస్తే రెండింతలు లేదా 200 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.308 కోట్ల నుంచి రూ.332 కోట్లకు ఎగబాకింది. మరోవైపు, గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.8 లేదా 400 శాతం డివిడెండ్‌ను ప్రతిపాదించింది.

గ్రేవ్స్ ఫ్యామిలీ ఈ-స్కూటర్

ప్రారంభ ధర రూ.1,09,900

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: విద్యుత్ వాహనాల తయారీ సంస్థ గ్రేవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ.. తాజాగా దేశీయ మార్కెట్‌కు ఫ్యామిలీ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. క్లాస్ టెక్నాలజీ అండ్ ఫీచర్స్‌తో తయారైన ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.1,09,900గా నిర్ణయించింది. 3.22 గంటల్లో పూర్తి స్థాయిలో రీచార్జికానున్న బ్యాటరీతో 136 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. గంటకు 93 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోవచ్చు



నని కంపెనీ సీఈవో విజయ కుమార్ తెలిపారు. 3 కిలోవాట్ల ఎల్ఎఫ్‌పీ బ్యాటరీతో 30 శాతం అదనంగా బ్యాటరీ లైఫ్ ఇవ్వనున్నదన్నారు. ఈ స్కూటర్‌పై కశ్మీర్ నుంచి కణ్యాకుమారి వరకు రైడ్ చేశారు.

ఫండ్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ అరికట్టేందుకు సెబీ చర్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: మ్యూచువల్ ఫండ్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపడానికి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ